నాడు కూల్చివేతలు... నేడు నిర్మాణాలు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.74 లక్షలతో నిర్మించిన రక్షణగోడ



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.78 లక్షలతో నిర్మిస్తున్న రైతుబజారు

- టీడీపీ హయాంలో వాణిజ్య సముదాయం, కల్యాణ మండపం నేలమట్టం
- వాటి పునర్నిర్మాణం ఊసెత్తని ఆ పార్టీ నాయకులు
- వైఎస్సార్ సీపీ పాలనలో చురుగ్గా అభివృద్ధి పనులు
- రూ.74 లక్షలతో రెండు నెలల్లోనే రక్షణ గోడ నిర్మాణం
- రూ.78 లక్షలతో జోరుగా రైతుబజారు నిర్మాణ పనులు



గ్రంథాలయ వీధిలో 2018లో టీడీపీ కూల్చివేసిన వుడా కల్యాణ మండపం

తగరపువలస: టీడీపీ పాలనలో కూల్చివేతలు, విధ్వంసం... వైఎస్సార్ సీపీ పాలనలో చురుగ్గా నిర్మాణాలు, అభివృద్ధి పనులు... ఇదీ భీమిలి నియోజకవర్గంలోని పరిస్థితి. ఈ మాట నియోజకవర్గ ప్రజలే చెబుతున్నారు. వంకర బుద్ధితో టీడీపీ నాయకులు అభివృద్ధి పనులు జరగని చోట సెల్ఫీలు తీసుకుంటూ అభాసుపాలవుతున్నారంటున్నారు. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన ఈ నాలుగేళ్లలో సంక్షేమంతో సమానంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని... కాస్త కళ్లు పెట్టి చూస్తే తెలుస్తుందని నియోజకవర్గ వాసులు అంటున్నారు. అందుకు ఉదాహరణగా కొన్నింటిని గుర్తు చేసుకుంటున్నారు.

వాణిజ్య సముదాయం కూల్చేశారంతే...

1983లో గ్రంథాలయ వీధిలో సత్యనారాయణస్వామి కొండను ఆనుకుని వుడా వాణిజ్య సముదాయం నిర్మించింది. తర్వాత ఆ సముదాయాన్ని భీమిలి మున్సిపాలిటీకి అప్పగించారు. వాటిలో చాలా వరకు గదులను వ్యాపార సంస్థలు అద్దెకు తీసుకుని వ్యాపారం నిర్వహించేవి. మరో విశాలమైన హాలులో ప్రారంభంలో సాంఘిక సంక్షేమ తరగతుల వసతిగృహం నిర్వహించారు. అనంతరం స్థానికుల అవసరాల నిమిత్తం కల్యాణ మండపంగా మార్చి అందుబాటులో ఉంచారు. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఆ వాణిజ్య సముదాయంతోపాటు కల్యాణ మండపాన్ని కూల్చి 2019 వరకు బోసిగా ఉంచింది. అక్కడ కొత్తగా నిర్మాణాల ఊసే ఎత్తలేదు. మరోవైపు 2004కు ముందు ఆ ప్రభుత్వ పాలనలోనే సత్యనారాయణపేట వాలు ప్రాంతాల ప్రజల రక్షణకు రెండు చోట్ల నిర్మించిన రక్షణగోడలు చిన్నపాటి వర్షాలకే కూలిపోయాయి. నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో ఒకటి 2022 సెప్టెంబరులో కూలిపోవడంతో స్థానికులకు తీవ్ర ఆస్తి నష్టం జరిగింది. అంతకు ముందు ఆ ప్రాంతంలో గోడ కూలి ఇద్దరి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.

రూ.1.52 కోట్లతో రక్షణ గోడ, రైతు బజారు

2021లో అప్పటి మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు రూ.78 లక్షలతో రైతుబజారు నిర్మాణానికి భూమిపూజ చేసి 2022 మే నుంచి పనులు ప్రారంభించారు. ప్రస్తుతం ఇక్కడ 47 కూరగాయల దుకాణాలు, 10 ప్రావిజినల్స్ స్టోర్స్ దుకాణాలతోపాటు టాయిలెట్లు, ఆర్వో ప్లాంట్, క్యాంటీన్, కార్యాలయం, టాయిలెట్లు, ఆఫీసు గది, స్టోర్, కాపలాదారులకు గదులు నిర్మిస్తున్నారు. ఇప్పటికి 75 శాతం పనులు పూర్తయ్యాయి. అలాగే టీడీపీ హయాంలో నిర్మించిన నాసిరకం రక్షణగోడలు కూలిపోవడంతో ఈ ఏడాది జనవరి 19న రూ.74 లక్షలతో రక్షణగోడ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆరు మీటర్ల ఎత్తు, 22 మీటర్ల వెడల్పుతో రెండు మాసాల్లో గోడ నిర్మాణం పూర్తి చేశారు. టీడీపీ విధ్వంసం కలిగించిన చోటే వైఎస్సార్‌సీపీ రూ.1.52 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్టు స్థానికులు గుర్తు చేసుకుంటున్నారు.

వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి



గత ప్రభుత్వాలతో పోలిస్తే వైఎస్సార్‌సీపీ ఈ నాలుగేళ్లలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టింది. సంక్షేమ పథకాలు అమలు చేసింది. మరే ప్రభుత్వమూ వైఎస్సార్‌సీపీతో పోల్చుకోవడానికి కూడా సరిపోదు.

– నందిక రాము, చిట్టివలస

చురుగ్గా ఎన్‌సీడీసీడీ సర్వే



వాంబేకాలనీలో సర్వే పరిశీలిస్తున్న వైద్యురాలు

మధురవాడ: మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నాన్ కమ్యూనికబుల్ డీసీజెస్ (ఎన్‌సీడీసీడీ) సర్వే చురుగ్గా సాగుతోంది. ఇందులో భాగంగా బుధవారం వాంబేకాలనీలో వైద్యురాలు ప్రశాంతి సర్వే తీరును పరిశీలించారు. నివాస ప్రాంతాల్లో 65 మంది ఆరోగ్య కార్యకర్తలు, 73 మంది ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నట్టు చెప్పారు. ప్రజల ఆరోగ్య సమస్యలు గుర్తించి ఎన్‌సీడీసీడీ యాప్‌లో నమోదు చేసి ఆయుస్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (ఏబీహెచ్) జనరేట్ చేస్తున్నామన్నారు. ఇది ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా ఉండాలని, భవిష్యత్‌లో ఏ ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లిగా ఖచ్చితంగా అవసరం ఉంటుందని చెప్పారు. ఈ ఐడీ జనరేట్ చేయాలంటే మొబైల్ నంబర్ ఆధార్‌తో లింక్ చేసుకోవాల్సి ఉంటుంది. ప్రతి ఒక్కరూ అకౌంట్ క్రియేట్ చేయించుకుని ఆరోగ్య సిబ్బందికి సహకరించాలని ఆమె కోరారు. పీహెచ్‌సీ పరిధిలో ఎన్‌సీడీసీడీ యాప్‌లో 1,73,042 మంది మ్యాప్ అవ్వగా ఇప్పటి వరకు 1,01,995 ఐడీలు జనరేట్ అయ్యాయని తెలిపారు. ఇంకా 71,047 ఐడీలు జనరేట్ చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల నైపుణ్యం వృద్ధికి కృషి



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ప్రతినిధులు

కొమ్మాది: ఇంజినీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్ తదితర వృత్తి విద్యా కోర్సులు అభ్యసించే విద్యార్థుల నైపుణ్యాలు పెంచడానికి గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయం చర్యలు తీసుకుంటుందని వీసీ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం పేర్కొన్నారు. గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాలు, ఆన్‌లైన్ కోర్సులు, సదస్సులు నిర్వహించడానికి ప్రైపెన్‌స్టా, ఎడూమూన్ సంస్థలతో బుధవారం అవగాహన ఒప్పందం చేసుకున్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల నైపుణ్యాలు పెంచుకోవడానికి ఈ ఒప్పందాలు ఉపయోగపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రైపెన్‌స్టా సంస్థ వ్యవస్థాపకుడు అతుల్య కౌశిక్, డైరెక్టర్ మనీష్ అగర్వాల్, ఎడూమూన్ చీఫ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బ్రిజేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సిరిమాను చెట్టు ఉత్సవం



ఎడ్ల బండిపై ఊరేగింపుగా తీసుకొస్తున్న సిరిమాను చెట్టు

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో పైడితల్లమ్మ సంబరాల్లో భాగంగా బుధవారం సిరిమాను చెట్టు తీసుకొచ్చే ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మద్ది పంచాయతీ తునిపాలంలో సిరిమానుకు అవసరమయ్యే చెట్టును కొట్టి ఎండ్ల బండిపై కృష్ణాపురం తీసుకొచ్చారు. తునిపాలం, మద్ది, పద్మనాభం గ్రామాల్లో అడుగడుగునా మహిళలు బిందెలతో చెట్టుకు నీరు పోసి పసుపు, కుంకుమతో బొట్లు పెట్టి పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, బొలె అప్పలనాయుడు, గాడు అప్పలరాజు, సుంకర నారాయణరావు, బొడ్డు శ్రీను, సురాల అప్పలనాయుడు, సుంకర పైడినాయుడు, తాలాడ పద్మనాభం, కంటుబోతు ఎర్నాయుడు, మొకర పైడినాయుడు పాల్గొన్నారు.

జ్యూట్ కార్మికుల బకాయిలు చెల్లించాలి

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు కార్మికులకు యజమాని బజోరియా పెండింగ్ బకాయిలు చెల్లించాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వీరు కాంగ్రెస్ కార్మిక సంఘ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. గత మార్చి నెలలో బజోరియాను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఫోన్‌లో సంప్రదించగా కార్మికులకు ఏమీ చెల్లించాల్సిన అవసరం లేదని, అన్నీ చెల్లించినట్టు అబద్ధం చెప్పారన్నారు. ఇటీవల జాయింట్ లేబర్ కమిషనర్ ద్వారా యాజమాన్యంపై ఒత్తిడి తీసుకురావడంతో కార్మికులకు బకాయిలు ఉన్నట్టు ఈ నెల 2న ఇచ్చిన జాబితాలో ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు జోక్యంతో యాజమాన్యం రూ.32 కోట్లు కార్మికులకు చెల్లించిందన్నారు. మిగిలిన బకాయిలపై త్వరలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును కలవనున్నట్టు కాంగ్రెస్ కార్మిక సంఘం, ఏఐటీయూసీ, టీఎన్‌టీయూసీ ప్రతినిధులు పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

ఆనందపురం : మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ ఎ.సురేష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. కొత్త లైన్లు ఏర్పాటు చేస్తున్న దృష్ట్యా తర్లువాడ, నగరప్పాలెం, గంటాపేట, ప్రక్కతివానిపాలెం, గుడిలోవ, దుక్కవానిపాలెం, పాలవలస, వేములవలస, పెద్దిపాలెం, లొడగలవానిపాలెం, బోయపాలెం, గిడిజాల, ముచ్చర్ల, మిందివానిపాలెం, గుమ్మిడివానిపాలెం, వేమగొట్టిపాలెం, తంగుడుబిల్లి గ్రామాల్లోని గృహ, వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పద్మనాభం: పద్మనాభం సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ రేవిడి ఫీడర్‌కు మరమ్మతులు చేపట్టనున్నందున పలు గ్రామాలకు ఈ నెల 5న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పద్మనాభం ఏఈఈ ఎ.జగన్‌మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. కురపల్లి, బర్లపేట, కొండ బర్లపేట, వెంకటాపురం గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

మధురవాడ: ఏపీ ట్రాన్స్‌కో మధురవాడ విద్యుత్ సబ్ స్టేషన్ వుడా కాలనీలో 11 కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ, మరమ్మతులు చేపడుతున్న కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని మధురవాడ సబ్ స్టేషన్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్‌వీఎస్ రామ్మూర్తి చెప్పారు. ఇందులో భాగంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు ఎన్‌జీజీవోస్ లే అవుట్, చంద్రంపాలెం, సుద్దగెడ్డ ఏరియా, వాంబేకాలనీ, పోర్టు కాలనీ, శ్రీనివాసనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. మరిన్ని వివరాలకు 94408 12525లో సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

ఇస్కాన్‌లో నరసింహ చతుర్దశి వేడుకలు నేడు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో గురువారం నరసింహ చతుర్దశి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఇస్కాన్ అధ్యక్షులు సాంబదాస్ ప్రభూజీ తెలిపారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున 4.30 గంటలకు స్వామి దర్శనం, 8 గంటలకు హారతి, గురుపూజ నిర్వహించి శ్రీ రాధా దామోదరులను వివిధ రకాల పువ్వులు, ఆభరణాలు, ప్రత్యేక దుస్తులతో అలంకరించనున్నారు. శ్రీ రాధా దామోదరులను ప్రత్యేకంగా చందనంతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తారు. అనంతరం లోక కల్యాణార్థం నరసింహ యజ్ఞం నిర్వహించనున్నారు. సాయంత్రం కీర్తనలు, నరసింహ స్వామికి అభిషేకం చేయనున్నారని తెలిపారు.

మార్షల్ ఆర్ట్స్ శిక్షణ ప్రారంభం



ఆదర్శనగర్‌లో ప్రారంభమైన మార్షల్ ఆర్ట్స్ శిక్షణలో విద్యార్థులు

తగరపువలస: భీమిలి జోన్ ఆదర్శనగర్‌లో ఆల్ ఇండియా మార్షల్ ఆర్ట్స్, పీఎస్ఆర్ కరాటే శిక్షణ శిబిరంలో బుధవారం నుంచి చిన్నారులకు మార్షల్ ఆర్ట్స్, కరాటేలో శిక్షణను బ్లాక్‌బెల్ట్ గ్రహీత బంగారు పరదేశి ఆధ్వర్యంలో ప్రారంభమయింది. ఈ నెలాఖరు వరకు నిర్వహించనున్న శిక్షణ శిబిరంలో ఆసక్తి కలిగిన యువతీ యువకులు పాల్గొనవచ్చని ఆయన కోరారు. ఆదర్శనగర్ ఆట స్థలంలో రోజూ ఉదయం 6 గంటల నుంచి 7.30 వరకు జరగనుంది. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందజేయనున్నారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు గణేష్, అశోక్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

5న సాయి ధ్యాన మందిర వార్షికోత్సవం

పద్మనాభం: మండలంలోని శేరిఖండంలో కొలువై ఉన్న షిర్డీ సాయి ధ్యాన మందిరం 13వ వార్షికోత్సవం 5న నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ సంగు శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా విశేష పూజలు, పంచామృత, విభూది అభిషేకాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

తీరంలో అకాల వర్షం

కొమ్మాది : బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం తీర ప్రాంతాల్లో అకాల వర్షం కురిసింది. మధ్యాహ్నం ఒక్కసారిగా మేఘం ఆవరించి సాయంత్రం వరకు వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రుషికొండ, ఐటీ జంక్షన్, సాగర్‌నగర్ ప్రభుత్వ అంధుల పాఠశాల సమీపంలో వర్షపు నీరు రోడ్డుపై ప్రవహించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



ఎంజీఎం ఆస్పత్రిలో పింఛన్ అందిస్తున్న సిబ్బంది

మధురవాడ: ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో లబ్ధిదారుల వద్దకే వెళ్లి సిబ్బంది సేవలు అందిస్తున్నారు. నగరంలోని మహాత్మ గాంధీ క్యాన్సర్ ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఆర్.రాజ్యలక్ష్మి అనే వృద్ధురాలికి సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ కె.స్వామి బుధవారం పింఛన్ అందజేశారు. మధురవాడ కార్‌షెడ్ కూడలి సమీపంలో ఉన్న 51వ నంబరు సచివాలయం సెక్రటరీతోపాటు సచివాలయ కన్వీనర్ కె.మురళీకృష్ణ ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేశారు.

మధురవాడలో మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న సీఐ రామకృష్ణ

మధురవాడ: మధురవాడ జంక్షన్‌లో గల చంద్రంపాలెం హైస్కూల్ సమీపంలో పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో బుధవారం పీఎంపాలెం పోలీసు ఇన్‌స్పెక్టర్ వై.రామకృష్ణ మజ్జిగ పంపిణీ చేశారు. కమ్యూనిస్ట్ నాయకుడు నాగోతి సింగన్న జ్ఞాపకార్థం పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగోతి సూర్యప్రకాశరావు ఏర్పాటు చేశారు. ఎస్ఐ అప్పారావు, ఇతర సిబ్బంది, నిర్వాహకులు పాల్గొన్నారు.

జట్లమ్మ తల్లికి పూజలు



జట్లమ్మ తల్లిని దర్శించుకుంటున్న మహిళలు

పద్మనాభం: మండలంలోని పాండ్రంగిలో మంగళవారం రాత్రి జట్లమ్మ తల్లికి పాండ్రంగి, మునివానిపాలెం, ఏనుగులపాలెం, కురపల్లి, బర్లపేట గ్రామాల భక్తులు పసుపు కుంకుమ సమర్పించారు. ఈ సందర్భంగా కాళీమాత, తప్పిటగుళ్లు, తీన్మార్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ పల్లి ఝాన్సీ, పీఏసీఎస్ అధ్యక్షుడు అముజూరి అప్పారావు, మాజీ సర్పంచ్ పల్లి మహేష్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పిన్నింటి వెంకటరావు, బొబ్బిలి సంతోష్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గృహ నిర్మాణ శాఖ ఈఈ సత్యనారాయణ

పద్మనాభం: జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ ఈఈ సత్యనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణంపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరితగతిన జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణంపై లబ్ధిదారులను చైతన్యపరచాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో విజయ్ కుమార్, గృహ నిర్మాణ శాఖ ఏఈఈ పద్మ, మండల పరిషత్ ఏఈఈ సుధాకర్ పాల్గొన్నారు.

వెలగని వీధి దీపాలు

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు రహదారిలో బండారు నానాజీ దుకాణం సమీపంలో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు వాపోతున్నారు. కొంతకాలంగా ఈ ప్రాంతంలో వీధి దీపాలు వెలగక అంధకారం అలుముకుంటుంది. ముఖ్యంగా 28ఎ/2/2 నంబరు స్తంభం నుంచి పక్కనే ఉన్న మిగిలిన స్తంభాల వరకు వెలగని వీధి దీపాలను పునరుద్ధరించాలని మాజీ సైనికుడు మేకల శ్రీనివాసరావు తెలిపారు.

ఆస్పత్రులు పరిశీలించిన డీఎంహెచ్‌వో



వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

పీఎం పాలెం: స్థానిక కీర్తన, వేదాంత ఆస్పత్రులను బుధవారం సాయంత్రం డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ రెండు ఆస్పత్రుల్లో అవసరమైన డాక్టర్లు, సిబ్బంది ఉన్నారని, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఉందని ఆయన తెలిపారు. అనంతరం అక్కడి వైద్యులకు ఆయన కొన్ని సూచనలు చేశారు. పేద రోగులను దృష్టిలో పెట్టుకుని వైద్య సేవలు అందించాలని, రుసుములకు సంబంధించిన ధరల పట్టిక, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఆస్పత్రి రిసెప్షన్‌లో ప్రదర్శించాలని సూచించారు.

జోన్ - 2లో వార్డుల ప్రత్యేక అధికారులు

మధురవాడ: జీవీఎంసీ జోన్ – 2 మధురవాడ పరిధిలో 5 నుంచి 13 వరకు గల వార్డుల్లో ఉన్న వివిధ సచివాలయాలకు సంబంధించి ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారుల్లో స్వల్ప మార్పులు జరిగాయి. ఇటీవల కొందరు బదిలీ కాగా, ఇతర కారణాల కొందరిని మార్చినట్టు జోనల్ కమిషనర్ కె.కనక మహాలక్ష్మి చెప్పారు. ఈ మేరకు ఆయా వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యల పరిష్కారం, సచివాలయాల్లో అందించే సేవల కోసం ప్రత్యేక అధికారులను నేరుగా లేదా ఫోన్ ద్వారా సంప్రదించవచ్చని ఆమె చెప్పారు.

వార్డు	అధికారి పేరు	హోదా	ఫోన్ నంబబర్
5	బి.రమేష్	ఆర్ఐ	98665 08143
6	ముగడ.రాజు	ఆర్ఐ	98664 44408
7	ఎమ్.వెంకటరావు	ఏఈఈ, వర్క్స్	74167 62597
8	సీహెచ్.స్రవంతి	ఏఈ, విద్యుత్ శాఖ	77299 95940
9	ఆర్.వంశీ కృష్ణ	డీఈఈ	99123 49450
10	పి.రమేష్	ఏసీ	99853 73797
11	ముగడ.రాజు	ఆర్ఐ	98664 44408
12	ఎన్.గంగాధర్	ఏపీడీ	77299 95947
13	వై.అప్పాజీ	ఏఈ	87127 08493

ఆదర్శనగర్ మధ్యలో మురుగు, తుప్పలు



నివాసాల మధ్య నిలిచిన మురుగు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు ఆదర్శనగర్ గ్రామంలో ఖాళీ స్థలాలు చుట్టుపక్కల వారికి భయాందోళన కలిగిస్తున్నాయి. ఇక్కడ పూర్తిస్థాయిలో డ్రైనేజీలు లేకపోవడంతో చుట్టుపక్కల వారు వినియోగిస్తున్న వాడుక నీరు ఖాళీ స్థలాల్లో చేరి బురదకుంటలను తలపిస్తుంది. అంతేకాకుండా ఈ నీటి మడుగులు పందులు, దోమలు, ఈగలకు ఆవాసంగా మారుతున్నాయి. మరోవైపు ఖాళీ స్థలాల్లో తుప్పలు పెరిగి విషపురుగుల సంచారం కూడా పెరిగింది. పాములు, తేళ్లు, జెర్రులు ఇళ్లలో ప్రవేశిస్తున్నాయని చుట్టుపక్కల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే స్థానికులు సచివాలయాల్లో పలుమార్లు ఫిర్యాదు చేశారు. నివాసాల మధ్య తుప్పలు తొలగించి మురుగునీరు వెళ్లేందుకు డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

గ్రంథాలయం నిర్మాణానికి శంకుస్థాపన



తునిపాలంలో గ్రంథాలయం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం : మండలంలోని మద్ది పంచాయతీ తునిపాలంలో మండల పరిషత్ సాధారణ నిధులు రూ.4 లక్షలతో గ్రంథాలయం నిర్మాణానికి బుధవారం ఎంపీపీ కంటుబోతు రాంబాబు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, వార్డు మెంబర్లు, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్



అంబేడ్కర్ కూడలిలో మ్యాన్‌హోల్ పక్కన ఖాళీ ప్రదేశం

తగరపువలస: స్థానిక అంబేడ్కర్ కూడలిలోని మ్యాన్‌హోల్ పక్కన ఉన్న కొద్దిపాటి ఖాళీ స్థలంలో ద్విచక్ర వాహనాలు ఇరుక్కుపోతున్నాయి. కూడలి రద్దీగా ఉన్న సమయంలో వేగంగా వచ్చే వాహనాల టైర్లు ఇందులో చిక్కుకుపోయి వాటి యజమానులు బోల్తా పడుతున్నారు. ఈ ఖాళీ ప్రదేశంలో ఐరన్ షీట్ లేదా కాంక్రీట్ వస్తువులు ఉంచి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

కవులకు పరిశీలన అవసరం

సీతంపేట: కవిత్వం రాసే నవకవులంతా ప్రముఖ కవులు, రచయితల రచనలు చదవడం, పరిశీలించడం అలవాటు చేసుకోవాలని సహృదయ సాహితి సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ సూచించారు. సహృదయ సాహితి ఆధ్వర్యంలో బుధవారం ప్రిజం కళాశాలలో నిర్వహించిన కవి సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. రచయిత కె.జి.వేణు మాట్లాడుతూ ఇటీవల దివంగతుడైన చిత్రకారుడు బాలి గొప్పతనాన్ని, కళా విశిష్టతను వివరించి నివాళులర్పించారు. జి.కె.సుబ్రహ్మణ్యం, రామతాతలను ఈ సందర్భంగా సత్కరించారు. చిన సూర్యనారాయణ, కవిత గమనం గమ్యం, రామతాత కవిత ధరాఘాతం, బి.రాధారాణి కబీర్ దాసు దోహాలు, కె.వి.ఎస్.మూర్తి కవిత భయం, కొత్తూరి రమణ ఊరగాయోపాఖ్యానం కవితలు చదివి వినిపించారు.